

సెల్ సిగ్నల్ అందక అవస్థలు

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలో సీకరి ఆశ్రమ బాలుర పాఠశాలలో మంగళవారం సెల్ సిగ్నల్ అందుబాటులో అందక ఉపాధ్యాయులు, విద్యార్థులు బయోమెట్రిక్ కోసం ఇబ్బంది పడ్డారు.విద్యా కానుక కిట్లు తర పథకాలన్నింటికి బయోమెట్రిక్‌తో సంబంధం పెట్టడంతో అవస్థలు పడ్డారు. సెల్ సిగ్నల్స్ అందక పోవడంతోఒ గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సిగ్నల్స్ మెరుగు పరచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



బయోమెట్రక్ వేసున్న ఉపాధ్యాయులు

ఘనంగా అల్లూరి జయంతి



అనంతగిరిలో అల్లూరికి నివాళి అర్పిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, గిరిజనులు

ప్రజాశక్తి-యంత్రాంగం

మన్య వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి మంగళవారం జిల్లా వ్యాప్తంగా వాడవాడలా ఘనంగా జరిపారు. ప్రజా ప్రతినిధులు అధికారులు రాజకీయ నాయకులు ప్రజా సంఘాల సంఘాల నాయకులు విద్యార్థులు పలుచోట్ల అల్లూరి విగ్రహాలకు, ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

పాడేరు: పాడేరు లోని కలెక్టరేట్ ఆవరణలో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ , డిఆర్ఓ పి. అంబేద్కర్, జి మాడుగుల జడ్పీటీసీ డా. ఎం వెంకటలక్ష్మి, ఎంపీపీ ఎస్ రత్న కుమారి కలక్టరేట్ సిబ్బంది తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటిడిఎ ప్రాంగణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఐటిడిఎ సహాయ ప్రాజెక్ట్ అధికారి ఎం. వెంకటేశ్వర రావు, పరిపాలన అధికారి హేమలత పూల మాలలు వేసి ఘనంగా నివ్వాలర్పించారు. ఐటిడిఎ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ఈ ఈ డి.వి.ఆర్.ఎం.రాజు, పరిశ్రమల శాఖ ఎ. డి నవీన్ తదితరులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని నక్కల పుట్టు గ్రామంలో టిడిపి నాయకులు బొర్రా నాగరాజు కొట్ట గుల్లి సుబ్బారావు ప్రసాద్ తదితరులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

అల్లూరి స్ఫూర్తితో ఉద్యమించాలి: అప్పలనర్స

పాడేరు:అల్లూరి ఉద్యమస్ఫూర్తితో అడవి, ఆదివాసీల హక్కుల రక్షణకు ఉద్యమించవలసిన అవసరం ఆసన్నమైందని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్శ పిలుపునిచ్చారు. గిరిజన సంఘం సంఘం జిల్లా కార్యాలయం వద్ద అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,ఆదివాసీలు, అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడిన వీరుడు అల్లూరి అని కొనియడారు.ఆదివాసీల అడవులూ, కొండలూ, గనులూ కార్పొరేట్లకు కట్టబెడుతున్న ప్రభుత్వాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎస్.ధర్మాన పడల్, కార్యదర్శి పి.బాల్ దేవ్, జిల్లా నాయకులు ఎల్.సుందర్రావు, కే.సత్యనారాయణ. టి.కృష్ణారావు, పి.సూర్యనారాయణ. కే.నర్సయ్య పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి: జెసి

పాడేరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకుని అందరూ చైతన్యవంతులు కావాలని సంయుక్త కలక్టర్ జె.శివ శ్రీనివాసు పిలుపునిచ్చారు. కలక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జేసి మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. స్థానిక ఎంపిపి రత్నకుమారి మాట్లాడుతూ దేశం కోసం, అడవి బిడ్డల బాగోగుల కోసం పోరాడిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు. జి.మాడుగుల జెడ్పిటిసి ఎంవెంకటలక్ష్మి మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అల్లూరి అని అభివర్ణించారు. డిఆర్ఓ పి. అంబేద్కర్, తహసిల్దార్ త్రినాధారావు నాయుడు, కలక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు: గిరిజన చట్టాలు. హక్కులు పూర్తిస్థాయిలో అమలు చేసి అల్లూరి ఆశయాలను కాపాడాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. చింతపల్లి మండలంలోని తాజంగి పంచాయతీ పాత తాజంగిలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామ యువత ఉపూర్ణ రవి శంకర్, చింతర్ల చినబాబు, చింతర్ల ప్రతాప్, మహిళలు మోహిని,చంటి పాల్గొన్నారు.

పాడేరు:జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎస్పి తుహిన్ సిన్హా పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ హిమగిరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:మండలంలోని బస్కి గిరిజన ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు అల్లూరి చిత్రపటాన్ని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరకువేలి ఎస్ఎఫ్ఐ కన్వీనర్ కిల్లో ధనలక్ష్మి మాట్లాడుతూ,గిరిజన ప్రాంతంలో గిరిజన హక్కులు, చట్టాల అమలుకు గిరిజనులను ఐక్యం చేసి పోరాటం సాగించారన్నారు.ఎస్ఎఫ్ఐ నాయకులు సిరగం చరణ్, కుమిడి శాంతి, కాకరి కొండమ్మ, సొడపల్లి ఇసుబాబు, వంతల బలరాం, పూజారి కృష్ణ పాల్గొన్నారు.

పెదబయలు:స్థానిక రెసిడెన్సియల్ బాలుర పాఠశాలలో అల్లూరి వేడుకలు ఘనంగా నిర్వహించారు ప్రిన్సిపాల్ డి శంకర్రావు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

దుంబ్రిగుడ: అల్లూరి జయంతి వేడుకలను మండలంలోని గుమ్మాగూడ గ్రామంలో గిరి బాల నేస్తం క్లబ్ మండల కన్వీనర్ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాల నేస్తం క్లబ్ లో ఉన్న చిన్నారులకు అల్లూరి జీవిత చరిత్రను మండల కన్వీనర్ కుమారి వివరించారు. గిరి పరి నేస్తం క్లబ్ మండల కమిటీ సభ్యులు ఎస్.గీత, శిరీష, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని అల్లూరి విగ్రహం వద్ద అల్లూరి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి ఆ సంఘం మండల అధ్యక్షుడు కే.సూర్య ప్రకాష్, ఏం.నవ సూర్య, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి నివాళు లర్పించారు.

జి.మాడుగుల:మండల కేంద్రంలో సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం, జివో నెం: 3 సాధన కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జె దీనబంధు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కొటారి కోటేశ్వరరావు మాట్లాడారు.నాయకులు మోధకొండమ్మ, సత్యవతి, కాంతమ్మ, జివో 3 సాధన కమిటీ నాయకులు సింహాచలం పాల్గొన్నారు.

పోరాటం చేయాలి: గంగరాజు

అనంతగిరి:అల్లూరి స్ఫూర్తితో గిరిజన హక్కులు, చట్టాల సాధనకై పోరుబాట సాగించాలని సీపీఎం జెడ్పీటీసీ. దీసరి. గంగరాజు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని బొడ్డచెట్టుకొలని వద్ద సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ,గిరిజన ప్రాంతంలో గిరిజనుల హక్కుల కోసం అల్లూరి ఉద్యమించారని, చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణాన్ని త్యాగం చేశారన్నారు. నేటి పాలకులు అల్లూరి స్ఫూర్తికి విరుద్ధంగా గిరిజనుల హక్కులు, చట్టాలను తుంగలో తొక్కుతున్నాయన్నారు. అంగన్వాడీ టీచర్ సరస్వతి, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జన్ని. సుబ్బారావు, సాగర. చినారావు, పాంగి.రవీంద్ర, కొర్ర .శివకృష్ణ, మహిళలు పాల్గొన్నారు

రాజవొమ్మంగి : ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ప్రజలు సమస్యలు పరిష్కారానికై అల్లూరి స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజా సంఘాల నాయకులు కొండ్ల సూరిబాబు, వజ్రపు అప్పారావు, పి.రామరాజు పిలుపునిచ్చారు. రాజవొమ్మంగి, దుర్గానగర్, తదితర గ్రామాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మన్యంలో బ్రిటిష్ వారి ఆగడాలకు వ్యతిరేకంగా, గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.సత్యనారాయణ, ఎస్.రాజు, జిలానీ, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సిపిఎం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు నాయకులు ఎస్.సూరిబాబు, జంపా పెంటయ్య, పాంగి గంగరాజు, వై.అప్పల నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి నడయాడిన ప్రాంతమైన మంప, రాజేంద్రపాలెం, కృష్ణదేవి పేట ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. సిదరి మల్లేసు, సైలజ గంగరాజు, వెంకటేష్, కుమార్, రాజేష్, పాల్గొన్నారు.



రంపచోడవరంలో అల్లూరికి నివాళి అర్పిస్తున్న అధికారులు

అల్లూరికి ఘన నివాళి

రంపచోడవరం : స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకొని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది మంగళవారం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడారు.ఐటీడీఏ పరిపాలన అధికారి డిఎన్వి రమణ, పిహెచ్ఓ కె.చిట్టి బాబు, ప్రాజెక్ట్ అగ్రికల్చర్ అధికారి రాంబాబు, ఎస్ఓ మార్తమ్మ, గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ బి.కిషోర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీనియర్ ఎస్టీ, ఎస్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పోస్టాఫీసు అల్లూరి విగ్రహానికి ఏపీ జెన్కో ఎస్సీ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్, లక్ష్మీనారాయణ పూలమాలలు వేని నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాడారు.ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, అసోసియేషన్ నాయకులు నాగరాజు, ఏడిఈ క్యాంపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.బాపన దొర, తహశీల్దారు కార్యాలయం వద్ద తాతారావు, పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ రాంబాబు అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు. పైడిపుట్ట గ్రామంలో గిరిజన ఆదివాసీ మహాసభ ఆధ్వర్యంలో, రాయపల్లి, ఇతర సచివాలయాల్లోనూ అల్లూరి జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో మండల సురక్ష ప్రత్యేక అధికారి శ్రీరాఘవన్, ఈవోపీఆర్డి చిన్నబ్బులు, ఆర్ఐ ఎర్రపు దొర, వీఆర్వో జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి వివిఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : స్థానిక బోదులూరి సెంటర్లో మండల జేసీఎస్ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ) అధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఎల్.సతీష్, లక్కోండ పాల్ బుజ్జీ, పి.సూర్యానారాయణ రెడ్డి, బాల ప్రసాద్, రాకేష్ పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో స్టోర్ రూమ్, విద్యార్థుల తరగతి, హస్టల్ గదులు, వంటశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తు సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రోజు మోను సక్రమంగా అమలు చేయాలని, నిత్యావసర వస్తువులు, కురగాయాలు ఎప్పటికప్పుడు తాజగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. వేడి, వేడి పదార్థాలు విద్యార్థులకు పెట్టాలని సూచించారు. విద్యార్థుల విద్యాబోధనలను పరిశీలించారు. జగనన్న విద్యా దీవెన కీట్లు ప్రతి విద్యార్థికీ అందాయా? లేదా? అని ఆరా తీశారు. పాఠశాల పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



సీలేరులో నేరేడు పళ్ళు విక్రయిస్తున్న మహిళ

ఆశాజనకంగా నేరేడు ఫలసాయం

ప్రజాశక్తి-సీలేరు


జీకే.వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాలతో పాటు మారుమూల అటవీ ప్రాంతంలో నేరేడు పండ్లు ఈ ఏడాది ఆశాజనకంగా పండాయి. వీటిని గిరిజనులు సేకరించి విక్రయాలు జరుపుతున్నారు. నేరేడు పండు మధుమేహానికి మంచిదని డాక్టర్లు సూచిస్తుండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. గత ఏడాది నేరేడు పండ్లు పంట పూర్తిగా ఏజెన్సీలో కనుమరుగయింది. ఈ ఏడాది నేరేడు ఆశాజనకంగా పండడంతో గిరిజనులకు కాసులు కురిపిస్తున్నాయి. చిన్న డొక్కును కొలమానికంగా తీసుకొని ఒక డొక్కు పది రూపాయల నుంచి 20 రూపాయలు విక్రయిస్తున్నారు. పిల్లి గెడ్డ, కాట్రగెడ్డ గిరిజనులు నేరేడుపల్లి సేకరించి వారపు సంతలతో పాటు విడిరోజుల్లో కూడా విక్రయాలు జరిపి అధిక లాభాలు పొందుతున్నారు. సీలేరు దారకొండ తదితర ప్రాంతాల్లో విక్రయాలు జరపడంతో కొనుగోలుదారులు ఎగబడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వివిఎస్ పనుల్లో భాగంగా గిరిజనులకు పని కల్పిస్తూ కొన్ని సంవత్సరాల క్రితం సీలేరు అటవీ రేంజి పరిధిలో నేరేడు మొక్కలు నాటారు. అవి నేటికీ తమకు పలసాయాలు అందిస్తుండడంతో ఆర్థికంగా దోహదపడుతున్నాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న మహిళలు

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని కొర్రాయి పంచాయతీ చిన్న అంజోడా గ్రామంలో తాగునీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో ఆ గ్రామం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జల జీవన్ ద్వారా బోరు నిర్మించి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నీళ్లు రాకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పని పరిస్థితుల్లో పొలంలోని బురద నీటిని సేకరించి ఉపయోగిస్తున్నామని, దీంతో వ్యాధులకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు వి స్వాతి, బి.సుమోని, బి.రాంబాబు, పి.పురుషోత్తం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం సర్పంచ్ మొస్య

'సాగు భూములు ఇచ్చేది లేదు'

గ్రామ సభలో తీర్మానం

ప్రజాశక్తి-అనంతగిరి:సాగు భూములను వియనగరం రాజులకు ఇచ్చేది లేదని తీర్మానం చేశామని టోకురు సీపీఎం సర్పంచ్ కిల్లో. మొస్య అన్నారు. పంచాయతీ సచివాలయలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి చేసిననాడే అబివృద్ధి సద్యపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీకి నిధులు సకాలంలో విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే 15వ. ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టోకూరు పంచాయతీ బి కంబవలస, రాయవలస రెవెన్యూ పరిధిలోని గిరిజనులు సాగు భూమి విజయనగరం రాజులకు ఇవ్వ రాదని తీర్మానం చేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నక్క రవికుమార్, ఉప సర్పంచ్ గెమ్మెల నర్సన్న, మాజీ సర్పంచ్ సారా దొన్ను, వార్డు సభ్యులు పూజరి లక్ష్మణ్, గుజ్జెల. పద్మ, కొర్రా. పార్వతి, శిరగం. ప్రసాద్, చంద్రన్న, గిరి చైతన్య స్వచ్ఛంద సంస్థ కొరుబారికి. చంద్రరావు, సీపీఎం సీనియర్ నాయకులు గెమ్మెల దేవన్న, నేచర్ ప్రతినిధి రాంబాబు, వాలంటీర్లు శాంతి, ప్రశాంతి, అప్పలస్వామి పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఒడ్డుగూడెం, విఆర్.పురం గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష గ్రామసభలు జెడ్‌పిటిసితో పాటు తహశీల్దారు ఎన్.శ్రీధర్, ఎంపీడీఓ ఎం.రత్నకుమారి, వైస్ ఎంపీపీ భవాని, సర్పంచ్ సోడి నరసమ్మ, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి చేతుల మీదుగా పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుజాత, సెక్రటరీ స్వరూపరెడ్డి, రేకపల్లి సెక్రటరీ శివప్రసాద్, చిక్కాల బాలు, జెసిఎస్ కన్వీనర్ బి. సత్యనారాయణ, ముత్యాల శ్రీను, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీలేరు : జికె.వీధి మండలం సీలేరులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీలేరు సచివాలయం పరిధిలో 996 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 125 సర్టిఫికెట్లు మంగళవారం జారీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, డిప్యూటీ తహశీల్దారు కుమారస్వామి, ఏఈ జ్యోతి బాబు, ఏపీవో రాంప్రసాద్, ఆర్ఐ మహదేవు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని ముసురిమిల్లిలో సర్పంచ్ కోసు రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం, వార్డ్ మెంబర్లు సరస్వతి, ప్రభావతి, జ్యోతి, పండు, సచివాలయం కన్వీనర్ కుంజం నాగమణి, వైసిపి నాయకులు బొబ్బా శేఖర్, బాలు రెడ్డి, కారం సంకురు, సింధు, వీక అబ్బులు, పంచాయతీ కార్యదర్శి నాగమణి, విఆర్వో ప్రభ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందిస్తున్న విఆర్.పురం ప్రజా ప్రతినిధులు



ఆర్థిక సాయం అందిస్తున్న నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షులు శివ ప్రసాద్

బాధిత వాలంటీరుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని యు.చీడిపాలెం పంచాయితీ పరిధి మర్రిపాకల గ్రామ వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న కొర్ర సత్తిబాబు సాయి దంపతుల నాలుగు నెలల బాబు ఇటీవల చనిపోవడంతో వారి కుటుంబానికి నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అరకు ఎంపీ ఆదేశాలతో ఆమె భర్త అయిన శివ ప్రసాద్ మంగళవారం మర్రిపాకల గ్రామానికి వెళ్లి వాలంటీర్ దంపతులను పరామర్శించి, ధైర్యం చెప్పి అర్థిక సాయం అందించారు. ఎలాంటి సహాయం కావాలన్నా సంప్రదించాలని సూచించారు. త్వరలోనే గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

వాలీబాల్ కిట్లు అందజేత

అనంతరం మంప ఎస్సై, పంచాయతీ సర్పంచ్ దడాల రమేష్ చేతుల మీదుగా పంచాయతీకి 15 వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసవ్వకుండా, చదువు, క్రీడలపై దృష్టి సారించి, ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు.

బాలారంలో ఎయిర్‌టెల్ సెల్ టవర్ ప్రారంభం

ప్రజాశక్తి -కొయ్యూరు

మండలంలోని బాలారం గ్రామంలో ఎయిర్ టెల్ సెల్ టవర్‌ను ఆ పంచాయతీ సర్పంచ్ అప్పన అప్పలనర్స మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలారంతో పాటు సుమారు 6 పంచాయతీ ప్రజల చిరుకాలపు కోరిక తన హయాంలో నెరవేరడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ప్రజలకు అంబులెన్స్, పోలీస్, అగ్నిమాపక వంటి సేవలను త్వరతగితిన అందుతాయని చెప్పారు. సెల్ టవర్ నిర్మాణానికి స్థలం దానం చేయడంతో పాటు త్వరగా పూర్తి ఏర్పాటు చేయడానికి కృషి చేసిన సర్పంచ్‌ను పంచాయతీ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మీరాజు, ఆనంద్, బంటు బుజ్జి పాల్గొన్నారు.



సెట్ టవర్‌కు పూజ చేస్తున్న సర్పంచ్ అప్పలనర్స

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ


ప్రజాశక్తి-మారేడుమిల్లి

రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని మారేడుమిల్లి, రంపచోడవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగిలోని ఏకలవ్య పాఠశాలలో 2023-2024 సంవత్సరానికి 7, 8, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో పలు సీట్లు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి మంగళవారం తెలిపారు. ఏడోవ తరగతి బాలురు 10, బాలికలు 20, ఎనిమిదో తరగతి బాలురు 6, బాలికలు 9, ఇంటర్ పస్ట్‌ఇయర్ బాలికలు ఎంపీసీ 6, హెచ్ఇసి 1, బాలురు బైపీసీ 3 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 6వ తేదీన రంపచోడవరం పీఎంఆర్సీ ప్రాజెక్ట్ కార్యాలయంలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కావలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలోని వేటమామిడి గ్రామ సమీపంలో ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని గ్రామస్తులు అడ్డతీగల సిహెచ్‌సికి తరలించారు. వీరిలో ఏలేశ్వరం గ్రామానికి చెందిన పి.రాజు కుడికాలు విరిగిపోగా వేటమామిడి పంచాయతీ పనుగురాతిపాలెం గ్రామానికి చెందిన మామిడి లచ్చిరెడ్డి ఎడమ కాలు విరిగింది. గంగవరం మండలం ఏటిపిల్లి గ్రామానికి చెందిన దాని కృష్ణారెడ్డి ఎడమ కాలు పోయింది. వీరికి డాక్టర్ సతీష్ ప్రథమ చికిత్స చేసి కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ధ్రువపత్రాలు అందిస్తున్న అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ

జగనన్న సురక్షతో గిరిజనులకు లబ్ధి

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి కుంతుర్ల పంచాయతీ కేంద్రాల్లో ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్యే ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ, పాడేరు అసిస్టెంట్ కలెక్టర్ అసుతోస్ శ్రీ వస్తావ్, ప్రత్యేక అధికారి సువర్ణ పణి హాజరయ్యారు. పెద కోడపల్లిలో అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ, ఈనెల 4 నుండి 24 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతిస్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. 11 పౌర సేవలకు సంబంధించి ఉచితంగా సేవలు అందిస్తున్నారన్నారు.లబ్ధిదారులకు గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందేవిదంగా చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో పెడికోడపల్లి ఉపసర్పంచ్, ఎంపీటీసీ పాల్గొన్నారు.

హుకుంపేట:- మండలంలోని జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గన్నేరుపుట్టు సచివాలయంలో ధ్రువపత్రాలను వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, అధికారులతో కలిసి మంగళవారం పంపిణీ చేసారు. గన్నేరుపుట్టు సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్షలో భాగంగా సమావేశం నిర్వహించారు.వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఈఓపీఆర్డి అశోక్ కుమార్, డీపీఓ కొండలరావు, గన్నేరుపుట్టు సర్పంచ్ కృష్ణారావు, సర్పంచ్ సూకూరు బొంజన్న దొర, వైస్ సర్పంచ్ మత్స్య రాజు పాల్గొన్నారు.

4,469 ధ్రువపత్రాలు పంపిణీ

పాడేరు: మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం లో 4,469 దవపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం 12 మండలాల పరిధిలోని 20 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. 20,314 గహాలనుంచి వాలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 19,210 వినతులు రాగా, 15,089 టోకెన్లు నమోదు చేయడం జరిగింది. 10,590 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. అందులో 4,469 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని, 78 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా మిగిలిన 6043 సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరుగుతుందని కలక్టర్ వివరించారు. అదే విధంగా జగనన్న సురక్ష శిభిరాలలో మూడు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అక్కడికక్కడే దరఖాస్తులు తీసుకొని ఆన్లైన్ చేసి ధ్రువపత్రాలు జారీ చేసి పంపిణీకి ఆదేశించటం జరిగిందన్నారు. నెట్ సౌకర్యం ఉన్న శిభిరాలలో రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, పంపిణీ అనే మూడు కౌంటర్లు ఏర్పాటు చేయటం జరిగిందని, లబ్దిదారులు ఈ ప్రత్యేక శిభిరాలలో అక్కడికక్కడే నమోదు చేసుకొని దవపత్రాలు పొందవచ్చని కలక్టర్ సూచించారు. ఆన్లైన్ లో నమోదైన ధ్రువపత్రాలను రానున్న రెండు రోజుల్లో పంపిణి చేయాల్సిందేనని కలక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. అదేవిదంగా ధవపత్రాల జారిపై ప్రత్యేక ద్రుష్టి సారించాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు.

10, 11 తేదీల్లో అంగన్‌వాడీల 36 గంటల ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్ర వ్యాప్తంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఈ నెల 10, 11 తేదీల్లో జరుగుతున్న 36 గంటల ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్లపు తులసి మాట్లాడుతూ, అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అధిక వేతనాలు చెల్లిస్తానని ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, కానీ నేటికీ నెరవేర్చలేదని తెలిపారు. ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో కోత విధిస్తుందన్నారు. దేశంలో మాతా శిశు మరణాలను తగ్గించేందుకు అంగన్‌వాడీలు కృషిచేస్తున్నారని, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారని, అటువంటి వారికి చట్టపరమైన హక్కులు లేకపోవడం అన్యాయం అన్నారు. 60 సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన తర్వాత గ్రాట్యూటీ తదితరాలు లేకుండా ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లిపోవలసిన పరిస్థితి ఉందన్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజీ

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: గిరిజన పివిటిజి కుటుంబాల స్థితిగతులు, జీవన విధానంపై కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజీ ఆరా తీశారు. మంగళవారం మండలంలోని బొండం పంచాయతీ రేగ గ్రామంలో పర్యటించి ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలు అందుతున్నాయా లేదా అని అడిగితెలుసుకున్నారు. రేగ గ్రామస్తులు మాట్లాడుతూ,రైల్వే ట్రాక్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామంలో రోడ్డు, మంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. పిల్లలు స్కూల్ కి, గ్రామస్తులు వ్యవసాయం కోసం వెళ్లాలన్నా రైల్వే ట్రాక్ దాటి వెళ్లాల్సి వస్తుందన్నారు. రైల్వే ట్రాక్ కింద నుండి రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.రైతులు పండించే ప్రతీ పంటను గిట్టుబాటు ధరలు కల్పించి ఐటీడీఏ పంటను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజీ మాట్లాడుతూ, గిరిజన పివిటిజి గ్రామాలకు రహదారి, రక్షిత మంచినీటి, రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందించడంలో ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. కాఫీ, మిరియాలు ప్రభుత్వ ఐటిడిఏ కొనుగోలు చేస్తోందని చెప్పారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు అతి త్వరలో పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజీ

ఐటీడీఏ ఏపీఓ మాట్లాడుతూ, పివిటిజి గ్రామాలకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. మంచినీరు, వ్యవసాయ పనిముట్లు, రుణ సహకారం సబ్సిడీతో పివిటిజి కుటుంబాలకు త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన డిప్యూటీ సెక్రెటరీ చంద్రిక, ఐటీడీఏ ఏపీఓ, తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో నగేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ అభిషేక్, ఆర్‌డబ్ల్యూ ఏఈ వినీల, సర్పంచ్ డి భాస్కరరావు, ఏటిడబ్ల్యూ మలికార్జున, సచివాలయం ఉద్యోగులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అరకువేలి మండల విద్యాశాఖ అధికారి వంతల త్రినాథరావు, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర శిబిరం ప్రారంభించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, సిఐటియు ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతంలో రక్తహీనత సికిల్ సెల్ అనీమియా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో అన్ని ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.విద్యాశాఖ అధికారి వంతల త్రినాథరావు, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అరకువేలి ప్రెస్ క్లబ్ కార్యదర్శి రవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా డోనర్స్ కు సర్టిఫికెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌బి పోతురాజు, సిఐటియు కార్యదర్శి, పర్యపురం ఉపసర్పంచ్ జన్ని భగత్ రాం, కె రామారావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ హరి, రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గనైజర్ లోహిత్, హ్యూమన్ రైట్స్ నాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'సాహితీ ఫార్మా' మృతులకు పోస్టుమార్టం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అచ్యుతాపురం ఎస్ఇజెడ్ సాహితీ ఫార్మా పరిశ్రమలో గత నెల 30న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సోమవారం మృతి చెందిన కార్మికులు బి.రామేశ్వర్, సమ్మెంగి అప్పారావు మృతదేహాలకు మంగళవారం కెజిహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి, స్వగ్రామాలకు తరలించారు. తక్షణసాయంగా మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున కంపెనీ యాజమాన్యం అందించింది. ఈ నెల 12వ తేదీలోపు మరో రూ.8 లక్షలు ఇవ్వడానికి, మిగిలిన మొత్తం రూ.25 లక్షలు ఆగస్టు 10వ తేదీ లోపు ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ మేరకు పరిశ్రమ యాజమాన్యం కంపెనీ లెటర్ హెడ్ మీద రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము బాధిత కుటుంబ సభ్యుల తరపున బి.ప్రసాద్, కర్రి శంకర్, బి.మహేష్, కంపెనీ యాజమాన్యం తరపున హెచ్.ఆర్ సీతారాం, సూపర్వైజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో అభివృద్ధి ఏదీ?

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని గోమాంగి పంచాయతీ బొడ్డపూట్టు గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదనిసిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జె సునీల్ అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ, బొడ్డపూట్టు గ్రామంలో రహదారి సౌకర్యం లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.ప్రభుత్వం, అధికారులు, పంచాయతీ సిబ్బంది బొడ్డపూట్టు గ్రామంలో సమస్యపై దృష్టి సారించలేదన్నారు. రహదారి లేక సంక్షేమ పథకాలు అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జీడీ, మామిడి సిల్వర్ ఓక్, జామ, నారింజ మొక్కలను అధికారులు పంపిణి చేయలేదన్నారు.గ్రామంలో శ్రమధానం తో మట్టి రోడ్డు మూడు కిలో మీటర్ల మేర గ్రామస్తులు నిర్మించుకొన్నారని, వర్షం కారణంగా బురదమయం అయ్యిందని తెలిపారు.సిసి రహదారికి నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు.

హుకుంపేట: జకరవలస, తుంభవలస గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం కార్యకర్తలు పృథ్వి, చిట్టిబాబు, కామేష్, శ్రీను, కొండబాబులు కోరారు. మండలంలోని చివరి బూర్జ పంచాయతీ నుండి 3కిలో మీటర్ల దూరంలో జకరవలస, తుంభవలస గ్రామాలు ఉన్నాయన్నారు. గ్రామాలు ఏర్పడి 80 ఏళ్ళు పైబడి అవుతున్నా రహదారి సౌకర్యం కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ గ్రామాల్లో 220 మంది జనభా ఉన్నారన్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించి గ్రామ అబివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు.



పెదబయలులో కురుస్తున్న వర్షం

మన్యంలో భారీ వర్షం

పెదబయలు: మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ విపరీతంగా కాసింది. ఒకేసారి వర్షం కురవడంతో పంట పొలాలకు వర్షపు నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

జిమాడుగుల: మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం కొండపోత వర్షం కురిసింది.స్థానిక వారపు సంత కావడంతో సంతకు వచ్చిన గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షంతో ద్విచక్ర వాహనదారులు ఎక్కడికక్కడ నిలిచిపోయారు.

వాల్తేర్ డివిజన్‌లో సానుకూల వృద్ధి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈ ఆర్థిక సంవత్సరంలో వాల్తేరు డివిజన్ వివిధ రంగాలలో సానుకూల వృద్ధిని సాధిస్తోందని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె త్రిపాఠి తెలిపారు. ఫ్రైట్ లోడింగ్‌లో జూన్ 2023లో డివిజన్ అత్యధికంగా 5.98 మిలియన్ టన్నుల లోడింగ్‌ను సాధించిందని పేర్కొన్నారు. ఇది గత ఏడాది జూన్ నెలలో చేసిన లోడింగ్‌ను అధిగమించిందని తెలిపారు. ఈ కాలంలో రూ.700.20 కోట్ల సరుకు రవాణా ఆదాయం సాధించిందని పేర్కొన్నారు. వాల్తేరు డివిజన్ జూన్ 2023లో అత్యుత్తమ ఐరన్ ఓర్ లోడింగ్ రేటును సాధించిందని తెలిపారు. రోజుకు 14.7 రేక్‌ల లోడింగ్ రేటుతో 1.90 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని లోడ్ చేసినట్లు వివరించారు. ఈ పనితీరుతో మునుపటి ఏడాది జూన్ నెల లోడింగ్ రేటును అధిగమించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల కృషిని వాల్తేర్ డిఆర్‌ఎం అనుప్ సత్పతి ప్రశంసించారు.

పలు రైళ్లకు టికిరి, సింగపూర్ రోడ్, భీమడోలులో స్టాప్‌లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైలు నంబర్ 18005/18006 హౌరా-జగ్దల్‌పూర్-హౌరా సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌కు టికిరి స్టేషన్‌లో, 18517/ 18518 కోర్బా-విశాఖపట్నం -కోర్బా ఎక్స్‌ప్రెస్‌కు సింగపూర్ రోడ్ స్టేషన్‌లో, 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ డివిజన్‌లోని భీమడోలు స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా స్టాప్‌గా నిర్ణయించారు. ఈ స్టాప్‌లు వచ్చే 6 నెలలు కొనసాగుతాయని, ప్రయాణికుల రద్దీ ఆధారంగా కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటారని రైల్వే శాఖ సీనియర్ డిసిఎం ఎకె.త్రిపాఠి తెలిపారు.

గీతంలో డిగ్రీ కోర్సుల ప్రవేశాలు

ప్రజాశక్తి -మధురవాడ: జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 2023-2024 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ళ డిగ్రీ కోర్సులు ప్రారంభిస్తోందని విశ్వవిద్యాలయం ప్రవేశాల విభాగం డైరక్టర్ డాక్టర్ ఉదయ్‌కుమార్ వెల్లడించారు. విశాఖపట్నం, హైదరాబాద్, తెలంగాణలో ప్రాంగణాలు కలిగిన గీతం ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఆర్కిటెక్చర్, మెడికల్, పారామెడికల్, ఫార్మశీ, నర్సింగ్, ఫిజియోథెరిపి వంటి వృత్తి విద్యాకోర్సులతో పాటు బిఎస్‌సి, బిఎ, బికామ్ వంటి డిగ్రీ కోర్సులను అందిస్తోందన్నారు.. స్కూల్ ఆఫ్ సైన్స్, స్కూల్ ఆఫ్ బిజినెస్, స్కూల్ ఆఫ్‌లా స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అఫర్ చేస్తున్న డిగ్రీ కోర్సులను నూతన విద్యావిధానానికి అనుగుణంగా నిపుణుల సహకారంతో ఉన్నతంగా రూపొందించామన్నారు. నాలుగేళ్ళ డిగ్రీ కోర్సులలో ప్రవేశం పొందేవారు మేజర్ సబ్జెక్టు ఎంపికతో పాటు మైనర్ సబ్జెక్టులుగా తమకు నచ్చిన అంశాలను ఏవిధంగా చదివి ప్రయోజనం పొందవచ్చో వివరించారు. వీటిలో ప్రవేశాలకు గీతం అడ్మిషన్ టెస్ట్ (గాట్-2023) నిర్వహిస్తున్నామని, ప్రతిభ కనబరిచిన వారికి స్కాలర్ షిప్‌ల అందజేస్తామన్నారు. గత ఏడాది దాదాపు మూడు వేల మంది విద్యార్థులకు రూ.23కోట్ల మేర స్కాలర్‌షిప్‌లను అందజేసినట్లు వెల్లడించారు. ఈఏడాది గీతంలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించామని, గీతం వెబ్‌సైట్ ద్వారా వివిధ కోర్సులలో ప్రవేశాలకు అర్హతలు, కోర్సుల ఫీజు వంటి సమాచారంతో పాటు సిలబస్ సహితం పరిశీలించవచ్చునన్నారు.

భవన కార్మికుల భద్రతకు చర్యలు

- సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి -మధురవాడ : భవన నిర్మాణ రంగంలో రోజురోజుకూ ప్రమాదాలు పెరుగుతూ,కార్మికులకు రక్షణ లేకుండా పోతూ, పలువురు మృత్యువాత పడుతున్నారని సిఐటియు మధురవాడ జోన్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం జివిఎంసి ఐదో వార్డు కొమ్మాది కూడలిలో సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు.ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజుకుమార్ మాట్లాడుతూ భవనల నిర్మాణానికి ప్లాన్ మంజూరు చేసే మున్సిపల్ ప్లానింగ్ విభాగం గానీ, భద్రతా పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ గానీ కార్మిక మరణాలపై స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది సామాన్య ప్రజలు, కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రమాదాలు జరిగి కార్మికులు మరణించడం, క్షతగాత్రులై వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నా యాజమాన్యం, అధికారులు స్పందించకపోవడం, బాధిత కుటుంబాలకు న్యాయం చేయకపోవడం అన్యాయమన్నారు..ఆదివారం బక్కన్నపాలెంలో తాపీ మేస్త్రి జోగి దశరథ్ ప్రమాదవశాత్తు మరణించగా, సిఐటియు ఆందోళనతో సంబంధిత భవన యజమానికి రూ.7.50లక్షల పరిహారం చెల్లించేందుకు అంగీకరించాడన్నారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు, భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యదర్శి పి.రాజశేఖర్, పి.ప్రసాద్, ఆర్ తాతారావు, నాగేశ్వరరావు, ఎం కంచయ్య, ఎ.లావణ్య పాల్గొన్నారు.

40 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, సింగన ఒద పంచాయతీ కృష్ణంరాజు పేట ఎంపియుపి పాఠశాల వద్ద మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 40 మంది రోగులకు వైద్యులు, సిబ్బంది నేత్ర వైద్య పరీక్షలు చేశారు. ఇందులో శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించిన ఐదుగురిని విశాఖ ఐ హాస్పిటల్‌కు తరలించారు. విశాఖ సత్యసాయి సంస్థలు, జిల్లా, జోన్, చిట్టివలస సత్య సాయి సమితి సంయుక్తంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో విశాఖ ఐ హాస్పిటల్ క్యాంప్ కోఆర్డినేటర్ పి శివ, సాయికృష్ణ ,వైద్యులు, సిబ్బంది సేవలు అందించారు జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, జోనల్ కో ఆర్డినేటర్ ఎంవి సత్యసాయి కుమార్, సత్యసాయి సమితి కన్వీనర్ జి సత్యనారాయణ పాల్గొన్నారు

రికార్డ్ స్థాయిలో అప్పన్న హుండీ ఆదాయం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను 14 రోజులకుగాను మంగళవారం ఇఒ విత్రినాధరావు పర్యవేక్షణలో తెరిచి లెక్కించారు. రికార్డు స్థాయిలో రూ2,05,72,705 నగదు 100.500 గ్రాముల బంగారం, 13.500కేజీల వెండితో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు ఈ లెక్కింపు కార్యక్రమంలో సహాయ కార్య నిర్వహణ అధికారి భ్రమరాంబ ఇఒ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

'ఉక్కు'యాజమాన్య వైఖరి మారాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ కార్మికుల నూతన వేతనాల అమలుపై యాజమాన్య వైఖరి మారాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉక్కునగరం యూనియన్ కార్యాలయంలో స్టీల్ సిఐటియు వర్కింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్ కార్మికులు నూతన వేతనాలు అమలకు 14 మాసాలుగా ఎదురుచూస్తున్నారన్నారు. గత వేతన ఒప్పందాలన్నీ సెయిల్‌లో అమలైతే,కొన్ని మార్పులతో ఎటువంటి జాప్యం లేకుండా ఇక్కడ కూడా అమలు చేయమని కోరారు. కానీ దీనికి భిన్నంగా యాజమాన్యం వ్యవహరిస్తూ, కార్మికులను మనోవేదనకు గురిచేస్తోందన్నారు.. ఈ పరిణామాలు కొనసాగితే కార్మికుల్లో అసంతృప్తి మరింత పెరిగి, స్టీల్ ప్లాంట్ ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. పరిస్థితులను చక్కదిద్దవలసిన బాధ్యత యాజమాన్యంపై ఉందనిగుర్తు చేశారు. యాజమాన్యం మొండిగా ప్రభుత్వ ఆదేశాలనే అమలు చేస్తామని మీనమేషాలు లెక్క పెడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో స్టీల్ ఉత్పత్తులపై యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి కర్మాగారం మనుగడకే ప్రశ్నార్ధకంగా మారుతోందని విమర్శించారు. ఈ పరిస్థితులను చక్కదిద్దకుండా, కర్మాగార భవిష్యత్తును అంధకారంలోకి నెట్టాలన్న ప్రభుత్వ ఆలోచన కార్యరూపంలో పెడుతోందన్నారు. వీటి పరిణామాలను కార్మికులకు వివరించి, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కార్మికుల ప్రయోజనాలకు .పెద్ద ఎత్తున ప్రభుత్వం, యాజమాన్యాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ అధ్యక్షత వహించిన సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు, టి వి కె రాజు, కె గంగాధర్, యు వెంకటేశ్వర్లు, పుల్లారావు, మరిడయ్య వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి

నిర్వాసిత కార్మికుల పట్ల నిర్లక్ష్యం వీడాలి

గంగవరం పోర్టు కార్మికుల నిరవధిక నిరసన దీక్షల్లో నేతలు



మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి -గాజువాక : ఆదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల పట్ల యాజమాన్య వైఖరికి నిరసనగా పెదగంట్యాడ గాంధీజంక్షన్ వద్ద మంగళవారం కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలను స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు ఈసందర్భంగా మాట్లాడుతూ, కార్మికుల వేతన పెంపుపై యాజమాన్యం మొండివైఖరి అవలంభించడం సరికాదన్నారు. ఈ ఏడాది ఇంక్రిమెంటు వేసేసామని, 2024లోనే వేతనాలను పెంచుతామని యాజమాన్యం దాటవేత ధోరణిలో చెప్పడం దుర్మార్గమన్నారు. దీనిపై వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, ఐటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి, వారి ద్వారా సిఎం జగన్‌కు విన్నవించామన్నారు. గంగవరం పోర్టు యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, సమస్యను పరిష్కరించాలని కోరినట్లు వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వాసిత కార్మికుల పట్ల గంగవరం పోర్టు యాజమాన్యం వైఖరి మారాలన్నారు.

78 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ గతేడాది రూ.500 కోట్లకుపైగా నికర లాభాలు ఆర్జించిన గంగవరం పోర్టు యాజమాన్యం, కార్మికుల వేతనాల పట్ల మొండివైఖరి వీడాలన్నారు. సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించకుంటే, గంగవరం పోర్టును స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య. కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, నరసింహ పాత్రుడు, గంధం శ్రీనివాసరావు వైసిపి గాజువాక నియోజకవర్గం ఇన్‌ఛార్జి దేవన్‌రెడ్డి, జనసేన నేత తాతారావు, స్టీల్ ప్లాంట్ గుర్తింపు యూనియన్ నేత ఆదినారాయణ, కసిరెడ్డి సత్య నారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఐఎన్‌టియుసి నేత కొవిరి అవతారం పాల్గొని, కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ కొవిరి అప్పలరాజు అధ్యక్షత వహించిన నిరసన దీక్షల్లో నొలి తాతారావు, వాసుపిల్లి, గంటిపిల్లి అమ్మోరు, మాదా అప్పారావు పేర్ల నూక రాజు, నొల్లి స్వామి, కదిరి సత్యానందం, గంటిపిల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

రైతు బజార్‌లో రాయితీపై టమోటా అమ్మకాలు

ప్రజాశక్తి -కరాస: టమోటా ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు రాయితీపై అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈమేరకు 52వ వార్డు మర్రిపాలెం రైతుబజార్‌లో ప్రత్యేక టమోటా విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేశారు జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ పర్యవేక్షణలో కౌంటర్లను ప్రారంభించారు. మంగళవారం రైతుబజార్‌కు 15 క్వింటాళ్ల టమోటాలు రాగా, మూడు కౌంటర్లలో పెట్టి, ఒక్కో వినియోగదారునికి కిలో చొప్పున కిలో రూ. 50లకే రాయితీపై విక్రయించే చర్యలు చేపట్టారు.

దంత వైద్యులకు గీతంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి -మధురవాడ: గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రి ఓరల్ మేక్సియోఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో దంత వైద్యలకు మైక్రోవాసుక్యులర్ పై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు విభాగం అధిపతి డాక్టర్ ఎన్.వి.వి.సత్యభూషణ్ తెలిపారు. చెన్నైకి చెందిన సవిత దంత వైద్య కళాశాల శస్త్ర చికిత్స విభాగం నిపుణులు డాక్టర్ సెంథిల్ మురుగన్, డాక్టర్ కార్తీరవన్‌లు రిసోర్సు పర్సన్‌లుగా వ్యవహరించి, ముఖానికి జరిగే శస్త్ర చికిత్స విధానాలను వివరించారని తెలిపారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి ఆపరేషన్ థియేటర్‌లో మంగళవారం దంత వైద్యలకు కింది దవడ శస్త్ర చికిత్స, కాలిఎముకను ఆధారంగా శస్త్ర చికిత్స జరిపే విధానాలను నిఋలు ప్రత్యక్షంగా చేసి చూపించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్నవారికి గీతం దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సీతారామరాజు సర్టిఫికెట్‌లను అందజేశారు.

మహిళాభివృద్ధికి బ్యాంకు రుణాలు

ప్రజాశక్తి-ఆనందపురం : మహిళాభ్యున్నతికి యూనియన్ బ్యాంకు అనేక రుణాలు, పథకాలను అమలు చేస్తోందనివిశాఖపట్నం యూనియన్ బ్యాంక్ ఎజిఎం సుధాకర్ అన్నారు. ఆనందపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఉమాపతి ఆధ్వర్యంలో. మంగళవారం లోడగలవాని పాలెం పంచాయతీ, నెల్తేర్ గ్రామంలో యూనియన్ బ్యాంక్ ప్రవేశపెట్టిన అనేక పథకాలపై మహిళలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎజిఎం సుధాకర్ మాట్లాడుతూ వ్యవసాయదారులకు, మహిళలకు యూనియన్ బ్యాంక్ కృషికేసాద్ మహిళా వికాస్, కృషి బంగారు రుణాలు, వ్యవసాయ మార్టిగేజ్ లోన్స్ ఇలా అనేక రకాల రుణాలను తక్కువ వడ్డీకే మహిళలకు అందిస్తోందని, వాటిని సద్వినియోగపరుచుకోవాలన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై విచారణ చేపట్టండి

ప్రజాశక్తి- పెందుర్తి : సర్వేనెంబర్ 123/4, 5 భూమిని కార్పొరేటర్ కబ్జా చేస్తున్నాడని సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు జగన్ విమర్శించారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సర్వే నంబర్123/4,5లో భూమిని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యే సహకారంతో కబ్జాకు పాల్పడి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గతంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేసి అక్కడ ఆక్రమణలను ఆపామన్నారు. పేదలకు ఇళ్లస్థలాలుగా పంచాల్సిన స్థలంలో కార్పొరేటర్ పాగా వేయడంపై కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి బి. రమణి మాట్లాడుతూ కోట్లు విలువైన స్థలంలో గతంలోనూ ఆక్రమణలకు పూనుకుంటే పోరాటం చేసి అడ్డుకున్నామన్నారు. సర్వే నెంబర్ 163లో స్థలంపైనా పదేళ్ల క్రితం పోరాటం చేసి జైలుకు వెళ్లామని, అప్పట్లో చాలమందికి పట్టాలు ఇచ్చారన్నారు. నివాసమున్నచోటే వారికి పట్టాలు ఇవ్వాలని,దీనిపై త్వరలోనే ఎమ్మెల్యేలను కలిసి విషయాన్ని వివరిస్తామన్నారు. సిఐటియు నాయకులు అప్పలనాయుడు, శంకరరావు ఐద్వా నాయకురాలు రజిని పాల్గొన్నారు

డిసిఆర్ సేవా రథం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : తగరపువలసకు చెందిన దుర్గాశేఖర్ తన సొంత నిధులు రూ.8 లక్షలతో సమకూర్చిన డిసిఆర్ సేవా రథాన్ని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎల్‌కెవి రంగారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని కొనియాడారు. సేవా రథం దాత దుర్గాశేఖర్ మాట్లాడుతూ, తల్లిదండ్రుల స్ఫూర్తి, కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. స్థానిక నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కైతపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, సేవా రథాన్ని అందజేసిన శేఖర్‌ను అభినందించారు. నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని నిరుపేదలకు అందించేందుకు, అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించేందుకు డిసిఆర్ సేవా రథాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దుర్గశేఖర్‌ను దుశ్శాలువా, ప్రశంసాపత్రంతో సత్కరించారు. స్థానిక సన్ స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎన్ఎల్‌రావు, రాజేటి బసవ కృష్ణమూర్తి, డాక్టర్ ఆదిత్య, కాళ్ళ సన్నీ, ఎం సూర్య శ్రీనివాస్, ఎ కిషోర్, కాకర సురేష్‌కుమార్, వి సతీష్, డి శివ, అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఎన్‌సిసి కాడెట్స్ ఐజి రంగారావుకు స్వాగతం పలికారు.